సంపుటి :02 సంచిక :274 పేజీలు :06

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

గురువారం 08, జనవరి 2026



తెలంగాణ ఆడబిడ్డలుగా

# కేసీఆర్‌ను ఆహ్వానించాం

- మేడారం జాతరకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆహ్వాన పత్రికలిచ్చాం
- మంత్రులు సీతక్క, కొండా సురేఖ

2

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- నగరాలు, పట్టణాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గాంధీభవన్‌లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం

5



# మామునూరు ముస్తాబు..

## రేవంత్ చేతుల మీదుగా భూముల అప్పగింత!

ఓరుగల్లు గగనతలంలో విమానాల రెక్కల చప్పుడు వినిపించే కాలం దగ్గరపడింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనులు పట్టాలెక్కనున్నాయి. అటు ఆధ్యాత్మికత, ఇటు అభివృద్ధి మేళవింపుగా.. సమ్మక్క–సారలమ్మ జాతర వేళ వరంగల్ గడ్డపై అద్భుత ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. మేడారం సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూములను విమానయాన సంస్థకు అప్పగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. గద్దెల వద్ద మొక్కులు తీర్చుకున్న చేతులతోనే.. వరంగల్ భవిష్యత్తును మార్చే విమానాశ్రయ పత్రాలను అధికారులకు అందజేయనున్నారు.

– అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

- 18, 19 తేదీల్లో మేడారానికి సీఎం..
- అదే రోజు ఏఏఐకి ల్యాండ్ హ్యాండోవర్?
- మార్చిలో ప్రధాని మోదీ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి కూడా ముహూర్తం ఖరారు!

2

కేంద్ర నిధులతోనే

# వరంగల్ అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వం నగరాభివృద్ధిని కుంటుపరుస్తోంది..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



5

# నిండు ప్రాణాలను కబళించిన పొగమంచు

- మోకిల వద్ద చెట్టును ఢీకొన్న కారు
- నలుగురు విద్యార్థుల దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

2



ప్రమోషన్ కోసం

# లక్ష డిమాండ్

ఇచ్చే స్థోమత లేదనడంతో వేరే ఆయాకు అప్పనంగా టీచర్ పోస్ట్ కట్టబెట్టిన సీడీపీఓ

విలేకరులకు వివరాలు వెల్లడించిన బాధితురాలు, ఆయా అరుణ

2



ఏసీబీకి చిక్కిన

# కేయూ ఎస్సై

రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

పేకాట కేసు నుంచి తప్పించేందుకు లంచం డిమాండ్

5



అంగన్వాడీ టీచర్ గా ప్రమోషన్ కల్పించేందుకు భూపాలపల్లి సీడీపీఓ, జిల్లా ఇంఛార్జి డీడబ్ల్యూఓ మల్లీశ్వరి రూ.లక్ష డిమాండ్ చేశారని, తనకు రూ.లక్ష ఇచ్చే స్తోమత లేదని, నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని చెప్పడంతో అన్యాయంగా పక్కగ్రామానికి చెందిన మరో ఆయా దుర్గం లక్ష్మి దగ్గర రూ.4 లక్షలు లంచం తీసుకొని కాశీంపల్లి అంగన్వాడి టీచర్ పోస్టును ఇచ్చారని బాధితురాలు, ఆయా గుండ్ల అరుణ ఆవేదన వ్యక్తం చేశారు.

– అక్షరదర్బార్, భూపాలపల్లి

# సీఎం చేతుల మీదుగానే..

**ఏఏఐకి మామునూరు ఎయిర్ పోర్ట్ భూముల అప్పగింతకు నిర్ణయం**

- 18న సీఎం మేడారం చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 19న గద్దెలు, ఆలయ ప్రాంగణం ప్రారంభం
- ఈ సందర్భంగా వరంగల్ లో ఏఏఐకి ఎయిర్పోర్ట్ భూములు అప్పగించే అవకాశం
- కుదరకపోతే సీఎం దావోస్ పర్యటన తర్వాత..
- మార్చిలో ప్రధాని చేతుల మీదుగా ఎయిర్పోర్ట్ పనులకు శంకుస్థాపన?



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:
దక్షిణాది కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని ఈ నెల 18, 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా వరంగల్ వాసుల దశాబ్దాల కల అయిన మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనుల్లో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతం కానున్నట్లు తెలిసింది. మేడారం పర్యటనను పురస్కరించుకొని సీఎం మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూములను వరంగల్ లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రతినిధులకు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ మేడారం వెళ్లే రోజు తిరుగు ముఖంలో గాని వీలుపడకపోతే, ముఖ్యమంత్రి దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ఫిబ్రవరి 1 తరువాత ఈ భూముల అప్పగింత ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. విమానాశ్రయ విస్తరణ కోసం రాష్ట్రప్రభుత్వం 223 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించిన విషయం తెలిసిందే.

## - ఏయే గ్రామాల్లోనంటే..

కొద్ది రోజుల క్రితం వరంగల్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జనరల్ మేనేజర్ బీవీ రావు బృందం ఇప్పటికే భూసేకరణ వివరాలను పరిశీలించింది. గతంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ వద్ద ఉన్న 696.14 ఎకరాలకు తోడు, రన్‌వే విస్తరణ కోసం నక్కలపల్లి, గాడిపల్లి, గుంటూరుపల్లి తదితర గ్రామాల్లో అవసరమైన 253 ఎకరాల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం పూర్తి కావచ్చింది. ఇందులో 30 ఎకరాల ప్రభుత్వ భూమి పోగా, మిగిలిన 223 ఎకరాల ప్రైవేట్ పట్టా భూములను రెవెన్యూ యంత్రాంగం రికార్డు స్థాయిలో సేకరించింది. పట్టా పాస్ పుస్తకాలు, సర్వే నంబర్ల తప్పులు వంటి చిన్నపాటి సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ అధికారులు భూమిని అప్పగించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ భూ సేకరణ చేసిన వరంగల్ కలెక్టర్ బృందానికి బుధవారం హనుమకొండలో పర్యటించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందనలు తెలిపారు.

### ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన

**ప్రభుత్వం నుంచి భూములు అప్పగించిన వెంటనే ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రక్రియ వేగవంతమైతే మరో రెండేళ్ల కాలంలోనే మామునూరు నుంచి విమాన సేవలు ప్రారంభమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వరంగల్ చుట్టుపక్కల ఉన్న మెగా టెక్స్ టైల్ పార్క్, ఐటీ హబ్, పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ విమానాశ్రయం వెన్నెముకగా మారనుంది. మేడారం జాతర సమయంలోనే ఈ కీలక అడుగు పడనుండటంతో ఉత్తర తెలంగాణ ప్రాంతవాసు ల్లో హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎయిర్పోర్ట్ పనులను మార్చిలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభింపజేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చే స్తున్నది. పర్యటనలో భాగంగా ప్రధాని కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను కూడా ప్రారంభించనున్నారు. మహబాబాబాద్ లో మెగా రైల్వే డిపోకు శంకుస్థాపన చేయనున్నారు.**

# ప్రమోషన్ కోసం లక్ష డిమాండ్

- ఇచ్చే స్థోమత లేదనడంతో వేరే ఆయాకు అప్పనంగా టీచర్ పోస్ట్ కట్టబెట్టిన సీడీపీఓ
- విలేకరులకు వివరాలు వెల్లడించిన బాధితురాలు, ఆయా అరుణ



అక్షరదర్బార్, భూపాలపల్లి: అంగన్వాడీ టీచర్ గా ప్రమోషన్ కల్పించేందుకు భూపాలపల్లి సీడీపీఓ, జిల్లా ఇంఛార్జి డీడబ్ల్యూఓ మల్లీశ్వరి రూ.లక్ష డిమాండ్ చేశారని, తనకు రూ.లక్ష ఇచ్చే స్తోమత లేదని, నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని చెప్పడంతో అన్యాయంగా పక్క గ్రామానికి చెందిన మరో ఆయా దుర్గం లక్ష్మి దగ్గర రూ.4 లక్షలు లంచం తీసుకొని కాశీంపల్లి అంగన్వాడి టీచర్ పోస్టును ఇచ్చారని బాధితురాలు, ఆయా గుండ్ల అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధితురాలు గుండ్ల అరుణ భూపాలపల్లి సీడీపీఓ కార్యాలయం ఆవరణలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా బాధితురాలు, ఆయా గుండ్ల అరుణ విలేకరులతో మాట్లాడుతూ తాను కాశీంపల్లి అంగన్వాడి సెంటర్–2లో గత 15 సంవత్సరాలుగా ఆయాగా విధులు నిర్వహిస్తున్నాను. కాశీంపల్లి అంగన్వాడి సెంటర్–1లో టీచర్ గా విధులు నిర్వహించిన ఝాన్సీ కొన్నేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో జంగేడు సెక్టార్ సూపర్వైజర్ అరుణ, భూపాలపల్లి సీడీపీఓ, ఇంఛార్జి డీడబ్ల్యూఓ మల్లీశ్వరి కాశీంపల్లి అంగన్వాడి సెంటర్–1లో టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, పదవ తరగతి పాసైన ఆయాలకు ప్రమోషన్ కల్పించి టీచర్ పోస్టు ఇస్తామని, అర్హులైన ఆయాలు దరఖాస్తు చేసుకోవాలని తనకు చెప్పడంతో, తాను కాశీంపల్లికి చెందిన స్థానికురాలును, పదవ తరగతి పాసై ఉన్నాను. తాను అన్ని విధాలుగా అర్హురాలను, కాబట్టి కాశీంపల్లి అంగన్వాడి సెంటర్–1 టీచర్ పోస్టుకు సిడిపిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నానన్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి సీడీపీఓ, ఇంఛార్జి డీడబ్ల్యూఓ ఇటీవలే సీడీపీఓ కార్యాలయానికి పిలుచుకొని తనకు రూ.1లక్ష లంచం ఇస్తేనే, కాశీంపల్లి అంగన్వాడి సెంటర్– 1 టీచర్ పోస్టు ఇస్తానని, టీచర్ పోస్టు కల్పించేందుకు రూ.1 లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. దీంతో తన వద్ద రూ.1 లక్ష లేవని, తాను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థి కుటుంబమని తాను రూ.1లక్ష ఇవ్వలేనని చెప్పడంతో సీడీపీఓ మల్లీశ్వరి నాపై కక్షగట్టి కాశీంపల్లి పక్క గ్రామమైన సెగ్గంపల్లి అంగన్వాడి సెంటర్లో విధులు నిర్వహిస్తున్న దుర్గం లక్ష్మి వద్ద రూ.4 లక్షలు లంచం తీసుకొని స్థానికురాలినైనా తనకు వచ్చే టీచర్ పోస్టును పక్క గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మికి కట్టబెట్టారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తన బాధను తెలుసుకొని లంచాలు తీసుకొని ప్రమోషన్ల పేరుతో ఆయాలకు టీచర్ ఉద్యోగాలు ఇస్తున్న సీడీపీఓ, ఇంఛార్జి డీడబ్ల్యూఓపై చట్టపరమైన చర్యలు తీసుకొని, స్థానికురాలిని, అన్ని విధాల అర్హురాలినైన తనకు కాశీంపల్లి అంగన్వాడి సెంటర్–1 టీచర్ పోస్టు ఇచ్చి తనకు న్యాయం చేయాలని బాధితురాలు, ఆయా గుండ్ల అరుణ కోరారు.



# తెలంగాణ ఆడబిడ్డలుగా కేసీఆర్ ను ఆహ్వానించాం

- మేడారం జాతరకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆహ్వాన పత్రికలిచ్చాం
- మంత్రులు సీతక్క, కొండా సురేఖ


అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ఆడబిడ్డలుగా మాజీ సీఎం, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించామని మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ తెలిపారు. ఇదే తరహాలో అన్ని పార్టీ ఫ్లోర్ లీడర్ల కు ఆహ్వానం అందించామని వెల్లడించారు. వారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లిలోనికేసీఆర్ నివాసానికి గురువారం మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క వెళ్లారు. ఈనెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతరకు ఆయన్ను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రిక అందించారు. మంత్రులను కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో ఇద్దరు మంత్రులను సత్కరించారు.

# నిండు ప్రాణాలను కబళించిన పొగమంచు

- మోకిల వద్ద చెట్టును ఢీకొన్న కారు
- నలుగురు విద్యార్థుల దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లాలో ఘటన



అక్షరదర్బార్, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలోని మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మీర్జాగూడ సమీపంలో అతివేగంతో ప్రయాణిస్తున్న ఒక స్పోర్ట్స్ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును అత్యంత బలంగా ఢీకొట్టింది. చెట్టును ఢీకొన్న ధాటికి వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. పొగమంచు కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఐసీఎఫ్ఏఐ యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను సూర్యతేజ, సుమిత్, శ్రీనిఖిల్, రోహిత్ అని పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు ప్రయాణిస్తుండగా, మరొక విద్యార్థి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో బయటపడ్డాడు. లోపల ఉన్న విద్యార్థుల మృతదేహాలు కారులో ఇరుక్కుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే మోకిల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ఐదో విద్యార్థిని చికిత్స నిమిత్తం తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారని సమాచారం. ప్రమాదానికి అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. విద్యార్థులంతా మోకిల ప్రాంతం నుంచి హైదరాబాద్ వైపు వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



# పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేంద్ర

అక్షర దర్బార్, చిట్యాల: పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడుగా చిట్యాల మండల కేంద్రానికి చెందిన కట్కూరి నరేంద్ర నియామకమయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కామార్థపు మురళి, ప్రధాన కార్యదర్శి రాచర్ల రామచంద్ర రావు ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనకు పదవీ బాధ్యతలు అప్పగించినందుకు యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కేతం సతీష్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, వరంగల్ జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



# బిక్కజిపల్లె సర్పంచ్ కు సన్మానం

అక్షర దర్బార్, దుగ్గొండి: మండలంలోని బిక్కజిపల్లె సర్పంచ్ బండారి రమేష్ ముదిరాజ్‌ను పీఆర్ ముదిరాజ్ సేవా సమితి గురువారం ఘనంగా సన్మానించింది. పీఆర్ ముదిరాజ్ సేవా సమితి, ముదిరాజ్ మహాసభ సీనియర్ నాయకులు ఓరుగంటి తిరుపతి, పొన్నం రాజు ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌ను శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు పులి సదానందం, సింగారపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ముదిరాజుల అభివృద్ధి ద్వారా హక్కులు సాధించవచ్చని అన్నారు. బిక్కజిపల్లెను ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని సర్పంచ్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారి రమేష్ ముదిరాజ్‌తో పాటు పీఆర్ ముదిరాజ్ సేవా సమితి నాయకులు బండారి ప్రకాష్, టి. రవి, దండు చిరంజీవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిపాలన విభాగంలో సీపీ తనిఖీలు

## తక్షణమే స్పందించాలని సూచన

అక్షరదర్బార్, హనుమకొండ: పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన శాఖపరమైన సమస్యలపై పరిపాలన విభాగం తక్షణమే స్పందించాల్సి ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన గురువారం పరిపాలన విభాగం కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీలు సీపీఓ కార్యాలయానికి చేరుకున్న సీపీకి అధికారులు పుష్పాగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సీపీ పరిపాలన విభాగం కార్యాలయంలోని బడ్జెట్, ఎస్టాబ్లిష్‌మెంట్, పే, జనరల్ సెక్షన్లతో పాటు యంఎస్ సెక్షన్లు, ఇన్‌వర్డ్, అవుట్ వర్డ్‌లను సందర్శించి సంబంధిత సెక్షన్ అధికారులు నిర్వహిస్తున్న విధులు, ఆయా సెక్షన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధులకు సంబంధించిన పలు రికార్డులను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ముఖ్యంగా సిబ్బందికి సంబంధించి శాఖపరమైన సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై సంబందిత సెక్షన్ అధికారులు తీసుకుంటున్న చర్యల వివరాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ పరిపాలన విభాగం సజావుగా కొనసాగేందుకు సంబంధిత అధికారులకు పలుసూచనలు అందజేశారు. అనంతరం సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ అధికారుల మధ్య ఎలాంటి ఆలస్యం లేకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిపోవాలని, పరిపాలన పరంగా ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకరావాలని అన్నారు. ఈ తనిఖీల్లో అదనపు డీసీపీ రవి, పరిపాలన విభాగం ఏఓ సంపత్, సెక్షన్ సూపరింటెండెంట్లు రమేష్,యాకూబ్ బాబా, సంధ్య, జలజ, రమాదేవి, సురేందర్‌తో పాటు ఇతర పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.



# సీపీఐ సభను జయప్రదం చేయాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి పిలుపు



అక్షర దర్బార్ , కేసముద్రం: జనవరి 18న ఖమ్మంలో జరగనున్న ఐదు లక్షల మందితో సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి పిలుపునిచ్చారు. గురువారం కేసముద్రం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ధర్మన్న భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రోద్యమం నుంచి నేటి వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సీపీఐ మాత్రమేనని, వందేళ్ల ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. దేశంలో బీజేపీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాటం అవసరమని, ఖమ్మం సభ ద్వారా పాలకులకు గట్టి సందేశం ఇస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్న ఈ బహిరంగ సభకు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి 'హలో కామ్రేడ్–ఛలో ఖమ్మం' నినాదంతో భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు చొప్పరి శేఖర్, మంద భాస్కర్, పూజారి రవి, దాసరి సాయిలు, దల్వాయి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# దళిత నాయకుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

అక్షర దర్బార్, శాయంపేట: దళిత నాయకుడిపై అగ్రవర్ణ ఎమ్మెల్యే చెప్పుతో దాడి చేశారనే వార్తాపత్రిక కథనాలను తీవ్రంగా ఖండిస్తూ శాయంపేట మండల కేంద్రంలో దళిత సంఘాలు, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అహంకారంతో ప్రవర్తించిన ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేసి, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక దళిత నాయకుడిపై అభాండాలు మోపి, తోటి నాయకుల సమక్షంలో దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మారపల్లి క్రాంతికుమార్, సీపీఐ నాయకులు వంగరి సాంబయ్య, అంకేశ్వరపు ఐలయ్య, తుడుం వెంకటేష్, మారపల్లి విజయ్, మారపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలి

అక్షర దర్బార్, పరకాల: రాష్ట్రంలో వెనుకబడిన తరగతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు గురువారం పరకాల మండల కేంద్రంలో ఎంఆర్‌వోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం జరగాలంటే బీసీ సబ్ ప్లాన్ అమలే పరిష్కారమని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బగ్గి రాజు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే అమలు చేయాలి : టీఆర్పీ

అక్షర దర్బార్ , చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) నాయకులు జిల్లా యూత్ అధ్యక్షుడు బండి సునీల్ ఆధ్వర్యంలో గురువారం చిట్యాల ఎమ్మార్వో ఇమామ్ బాబాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే బీసీల సమగ్ర అభివృద్ధికి చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీల సామాజిక–ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిట్యాలలో ఘనంగా సీఎం కప్ 2వ ఎడిషన్ టార్చ్ ర్యాలీ

అక్షర దర్బార్, చిట్యాల: గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్ 2వ ఎడిషన్–2025 క్రీడా పోటీలకు సంబంధించిన టార్చ్ ర్యాలీ గురువారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ శ్రీమతి తౌటం లక్ష్మి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌వో) చిర్ర రాఘు ప్రారంభించారు. క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 8 నుంచి 17 వరకు పది రోజుల పాటు టార్చ్ ర్యాలీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయి, 28 నుంచి 31 వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 44 రకాల క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్, 4వ వార్డు సభ్యుడు తౌటం నవీన్, ఎంఈఓ రఘుపతి, ఎస్ఐ శ్రవణ్, ఎంఆర్‌వో షేక్ బాబా ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.





## మాస్టర్ ట్రైనర్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి

అక్షరదర్బార్, మరిపెడ: ఎన్నికల విధుల శిక్షణ కోసం మాస్టర్ ట్రైనర్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని పీఆర్టీయూ–టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిర్యాల సతీష్ రెడ్డి, చాగర్లముడి శ్రీధర్ మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల శిక్షణలో స్కూల్ అసిస్టెంట్లను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారని, రాబోయే మునిసిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణ నుంచి వారిని మినహాయించాలని కోరారు. మార్చిలో పదో తరగతి పరీక్షలు ఉన్నందున స్కూల్ అసిస్టెంట్లను నియమించడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గత ఎన్నికల్లో విధులు నిర్వహించిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించాలని, అలాగే అన్ని మండలాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిఆర్టీయూ మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్, సంఘం బాధ్యులు దోమల లింగన్న, వెంకట్ రెడ్డి, కరుణాకర్, హాల్య, నాగరాజు పాల్గొన్నారు.




## అలియాబాద్ లో ప్రజాబాట


అక్షర దర్బార్, పరకాల: క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాబాట కార్యక్రమం శుక్రవారం పరకాల మండలం అలియాబాద్ గ్రామంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ నేతృత్వంలో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సనత్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌ను బాధ్యతతో వినియోగించాలని, బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

### మదనపల్లిలో..

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి: రైతులకు విద్యుత్ బాట కార్యక్రమంలో భాగంగా ములుగు ఎస్ఈ ఆనందం ఆధ్వర్యంలో ములుగు మండలం మదనపల్లి గ్రామంలో వ్యవసాయ రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టరాదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీఈ నాగేశ్వర్ రావు, డీఈ (టెక్నికల్) రాజు, ఏఈ రవి, సబ్ ఇంజనీర్ హరీష్, ఎల్ఐ జహురోద్దీన్, ఏఎల్ఎం అశోక్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## నాగార్జున డైరీ ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులు



అక్షర దర్బార్, చిట్యాల: నాగార్జున డైరీ ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నట్లు నాగార్జున పాల డైరీ సీఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాగార్జున డైరీ పార్లర్ నూతన శాఖను సీఈవో కృష్ణ ప్రసాద్, స్థానిక సర్పంచ్ తవటం లక్ష్మీ అంతయ్య, ఎండీ ప్రభాకర్ రావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ 2006లో ప్రారంభమైన నాగార్జున డైరీ ద్వారా పాలు, పెరుగు, పన్నీర్‌తో పాటు ఇటీవల ప్రారంభించిన నాగార్జున రైస్ (ఆర్ఎన్ఆర్ జైశ్రీరామ్)ను వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ తవటం లక్ష్మీ అంతయ్య ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని కోరారు. పార్లర్ ప్రారంభానంతరం నూతన సర్పంచ్ తవటం లక్ష్మీ అంతయ్యను నాగార్జున డైరీ అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున కంపెనీ సేల్స్ మేనేజర్ వెనిశెట్టి శివకుమార్, ఏఎస్ఎమ్ వెంకటేష్, విజయ్, రాకేష్, పార్లర్ నిర్వాహకులు సిద్ధార్థ, సురేష్, కంకణాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

04 గురువారం 08.01.2026 www.aksharadarbar.com అక్షర దర్బార్ Voice of the people

## సమన్వయంతో మహా జాతరను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్. మహేందర్ జీ
- జోనల్, సెక్టార్ అధికారులకు శిక్షణ




అక్షర దర్బార్ , ములుగు జిల్లా ప్రతినిధి: శ్రీ సమ్మక్క–సారలమ్మ మహా జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ అన్నారు. మేడారం జాతర విధి నిర్వహణపై జోనల్, సెక్టార్ అధికారులకు గురువారం మేడారం హరిత హోటల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతర కోసం మేడారం ప్రాంతాన్ని 12 జోన్లుగా విభజించి, 62 మంది జోనల్ అధికారులు, 51 సెక్టార్లకు 179 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రజల భద్రత, రవాణా నియంత్రణ, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలపై అధికారులకు అవగాహన కల్పించామని చెప్పారు. డ్రోన్ సర్వెలెన్స్, మాస్టర్ కంట్రోల్ రూమ్ ద్వారా జనసందోహాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. జంపన్న వాగు ప్రాంతంలో అప్రమత్తంగా ఉండి, మూడు షిఫ్టుల్లో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జోనల్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### కొండాయి వైద్యాధికారి డా. హెచ్. ప్రణీత్



అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొండాయి వైద్య అధికారి డా. హెచ్. ప్రణీత్ అన్నారు. గురువారం కొండాయిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హెల్త్ క్యాంపులో 35 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత అత్యంత అవసరమని, త్రాగునీటిని మరిగించి త్రాగాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆలం మానస, వార్డు సభ్యుడు బొచ్చు ఉపేందర్, హెల్త్ అసిస్టెంట్ కోరం భాస్కర్ రావు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేకంపల్లిలో ప్రజాబాట–పొలంబాట




అక్షర దర్బార్, దుగ్గొండి: మండలంలోని రేకంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాబాట–పొలం బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సర్పంచ్ కొలుగురి సుజాత సమక్షంలో అధికారులు గ్రామంలో వీధిలైట్లు, ట్రాన్స్ ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు అమర్చుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందని పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, హెల్పర్లు, వార్డు సభ్యుడు బొమ్మరాబోయిన నరసింహస్వామి, గ్రామ ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు గర్హనీయం

### ఎమ్మెల్యే కార్యక్రమాల బహిష్కరణకు నిర్ణయం

అక్షరదర్బార్, పరకాల: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి స్థానిక జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. గురువారం పరకాల బస్టాండ్ వద్ద ఆక్రమణల తొలగింపును పరిశీలించేందుకు ఎమ్మెల్యే వచ్చిన సమయంలో ట్రాఫిక్ సమస్యలను జర్నలిస్టులు ప్రస్తావించగా అవమానకరంగా స్పందించారని ఆరోపించారు. దీనికి నిరసనగా జర్నలిస్టులు కవరేజీ నుంచి బయటకు వచ్చారు. ఈ ఘటనపై అమరదామంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను అప్రజాస్వామికమని ఖండిస్తూ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీనియర్, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ

అక్షర దర్బార్, వెంకటాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వెంకటాపూర్ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ అన్నారు. గురువారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుకుంటారని, వారికి పౌష్టిక ఆహారం అందించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సక్రమంగా అందుతోందా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. వంట సిబ్బంది ఆహారాన్ని శుభ్రంగా, రుచిగా వండాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి శెట్టి కోటి,మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చీకుర్తి రమేష్, వార్డు మెంబర్లు బానోతు సునీల్ గవాస్కర్, నల్ల కోటి,  నాయకులు జాకీర్, శ్రావణ్, యుగేందర్, గణేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- నగరాలు, పట్టణాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గాంధీభవన్లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం



అక్షరదర్బార్, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. వార్డు స్థాయి నుంచి పటిష్టమైన యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని, స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రజలకు అండగా ఉంటూ వారి నమ్మకాన్ని గెలుచుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా అవతరించాలని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరుపేదలపై కక్షతో వ్యవహరిస్తోందని, నిబంధనల మార్పు ముసుగులో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సమాధి చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. అధికారం ఉందని ఇష్టారీతిన వ్యవహరిస్తే అంగీకరించేది లేదని, మెజారిటీని అడ్డం పెట్టుకుని పేదలను అణచివేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల వలసలు ఆగిపోయాయని, వెట్టిచాకిరీ నుంచి పేదలకు విముక్తి కలిగిందని గుర్తుచేస్తూ, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కేంద్రం ఈ విప్లవాత్మక చట్టాన్ని బలి ఇస్తోందని ధ్వజమెత్తారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించేందుకు, కోట్లాది మంది పేదలను దేశ పౌరులే కాదని చూపించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రం కుట్రలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, గతంలో నల్ల చట్టాలను ఉపసంహరించుకునేలా చేసినట్లే, ఉపాధి హామీ విషయంలోనూ కేంద్రం వెనక్కి తగ్గే వరకు పోరాటం సాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఈ నెల 20 నుంచి గ్రామ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తాను స్వయంగా ఒక మండలం బాధ్యత తీసుకుంటానని, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని ఆదేశించారు. ఫిబ్రవరి 3 నుంచి ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో లక్ష మందితో భారీ బహిరంగ సభలు నిర్వహించి, వికసిత్ భారత్ పేరుతో సృష్టిస్తున్న 'సంక్షోభ భారత్' అసలు స్వరూపాన్ని ఎండగడతామని ప్రకటించారు.



# కేంద్రం నిధులతోనే వరంగల్ అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వం నగరాభివృద్ధిని కుంటుపరుస్తోంది..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ మహానగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. ఆ కృషికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అడ్డుకుంటున్నాయని, ఆ నిధులను దారి మళ్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నగరాభివృద్ధిని కుంటుపరుస్తుందని విమర్శించారు. గురువారం వరంగల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వరంగల్ చౌరస్తాలో ఘనస్వాగతం పలికారు. కాషాయ జెండాల రెపరెపల మధ్య సాగిన భారీ బైక్ ర్యాలీలో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద శివనగర్ మండలం నాయకులు క్రేన్ సహాయంతో ఆయనకు భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం రాజశ్రీ గార్డెన్‌లో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాశీ తర్వాత అంతటి విశిష్టత కలిగిన "పంచశైవక్షేత్రాల" నగరం ఓరుగల్లు అని కొనియాడారు. ఇంతటి ఘనచరిత్ర ఉన్న నగరాన్ని పాలకులు విస్మరించడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ వంటి పథకాల ద్వారా కేంద్రం నేరుగా వేల కోట్ల నిధులు కేటాయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వకపోగా, కేంద్రం చేసిన పనులకు తామే చేశామంటూ రంగులు పూసుకుంటున్నారని మండిపడ్డారు. టెక్స్ టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, రైల్వే తయారీ పరిశ్రమ వంటివన్నీ మోదీ ప్రభుత్వ చొరవతోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. వరంగల్ నగరానికి పూర్వ వైభవం రావాలంటే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.గౌతమ్ రావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్, జిల్లా ఇన్చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తనేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, అరూరి రమేష్, మాజీ మేయర్ టి రాజేశ్వరరావు, ప్రదీప్ రావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీపీసీసీ చీఫ్ ను కలిసిన ఈవీ

అక్షరదర్బార్, హనుమకొండ : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు కలిశారు. టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన శ్రీనివాసరావు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఉల్లాస్ అక్షరాస్యతపై ఆర్పీలకు శిక్షణ




అక్షరదర్బార్, పరకాల: పరకాల పురపాలక సంఘం పరిధిలోని మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ ఓబీలకు 'ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల' అక్షరాస్యత కార్యక్రమం అమలులో భాగంగా ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎల్ఎఫ్ ఓబీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు తమ పరిధిలోని ఎస్ఎస్‌జి మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి, పదిమందికి ఒక వలంటీర్‌ను ఎంపిక చేసి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కే. నారాయణ, పురపాలక సంఘం కమిషనర్ అంజయ్య, మెప్మా టీఎంసీ సతీష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## సోలార్ డ్రోన్ టెక్నీషియన్‌పై యువతకు శిక్షణ

- రెండు వారాల పాటు ట్రైనింగ్

అక్షర దర్బార్, చిట్యాల : నిరుద్యోగ యువతీ యువకులకు సోలార్ డ్రోన్ టెక్నీషియన్ పై ఉచితంగా రెండు వారాలపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సింగరేణి కాలర్స్ కంపెనీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ గురువారం చిట్యాల మండల కేంద్రంలో ఒక ప్రకటనయందు తెలిపారు. డిగ్రీ ఐటిఐ ఎస్ఎస్సి పాసై 18 నుండి 42 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15వ తారీకు లోపు భూపాలపల్లి సింగరేణి జీవి టిసిలో అప్లికేషన్ తీసుకొని నింపి ఆఫీస్ లో ఇవ్వాలని ఆయన తెలిపారు రెండు వారాల శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరము పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు ఉత్సాహవంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ పిలుపునిచ్చారు.

# ఏసీబీకి చిక్కిన కేయూ ఎస్సై

- పేకాట కేసు నుంచి తప్పించేందుకు లంచం డిమాండ్
- రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ




అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి మెరుపు దాడి చేసి కాకతీయ యూనివర్సిటీ (కేయూ) పోలీసు స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఒక పేకాట కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోకుండా, కేసును తేలిక చేసి అతనికి అనుకూలంగా వ్యవహరించేందుకు ఎస్సై శ్రీకాంత్ రూ.15 వేల నగదును డిమాండ్ చేశారు. బాధితుడిని పదేపదే వేధిస్తూ డబ్బుల కోసం ఒత్తిడి చేయడంతో, చేసేదేమీ లేక సదరు వ్యక్తి అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో వలపన్ని, గురువారం బాధితుడి నుంచి ఎస్ఐ శ్రీకాంత్ రూ.15 వేల లంచం తీసుకుంటున్న సమయంలో ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కేయూ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడటం సంచలనం కలిగించింది. 2026 సంవత్సరంలో ఏసీబీ అధికారులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేసు నమోదు చేయడం ఇదే మొదటిది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915